'ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తాం'

బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, జూలై 16 : నియోజకవర్గంలో ప్రజల సౌకర్యం కోసం ప్రతి గ్రా మానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో నాగర్‌కర్నూల్ నుంచి వయా తూడుకుర్తి మీదుగా వనపర్తి వెళ్లే బస్సును ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అ నేక రూట్లలో బస్సులను రద్దు చేయడం జ రిగింది, వాటి వివరాలను తెలుసుకొని ప్రతి గ్రామానికి మళ్లీ బస్సు సౌకర్యం క ల్పించే విధంగా అధికారులతో చర్చించడం జరిగిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్ర భుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచి తం బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించిందని, రద్దీ ఎక్కువగా ఉన్నందున రాష్ట్ర వ్యా ప్తంగా 2250 బస్సులను కొత్తగా కొనుగో లు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీ సుకుంటుందన్నారు. అనంతరం బస్సును తూడుకుర్తి వరకు నడుపుకుంటూ వెళ్లారు.

మరమ్మతు పనులు పూర్తి చేయాలి

వ్యవసాయ సాగులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎంజీకేఎల్ఐ డీ 7, డీ8, డీ9 కాల్వల మరమ్మతులను వెంటనే పూర్తి చేసి రైతుల పొలాలకు నీరందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. బస్సు నడుపుకుంటూ తూడుకుర్తి గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే మధ్యలో కాల్వ పనులను పరిశీలించారు. వనపర్తి ప్రాజెక్టు అధికారి డీజీ మధుసూదన్‌రావుతో సమాచారం తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి నూతన భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి తన స్వగ్రామమైన తూడుకుర్తిలో నిర్వహిస్తున్న మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో కార్యక్రమంలో డిపో మేనేజర్ దేవరాజు, నాయకులు కోటయ్య, నర్సింహ, మైనార్టీ నాయకులు ఎండీ జబ్బార్, ఎండీ ఖాజా, ఎండీ రఫీ, వార్డు సభ్యులు ఖాజా ఖాన్, మైనుద్దీన్, మాజీ ఎంపీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంగనూర్‌లో..

బిజినేపల్లి, జూలై 16: మండలంలోని మంగనూర్‌లో ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. మొదట మిషన్ భగీరథ పైపులైన్ వాటర్ లెవల్ తక్కువగా ఉండడంతో కొంత కాలంలో నీటి సమస్య ఉండేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా నీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా స్థానికంగా ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సమస్యలు పునరావృత్తమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎమ్మెల్యే హెచ్చరించారు.

సీఎం సమావేశంలో కందనూలు కలెక్టర్

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూలై 16 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని డాక్ట ర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై అన్ని జి ల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా సమీ క్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరయ్యారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఆయా జిల్లా కలెక్టర్లతో ప్రజాపాలన, ధరణి, వ్యవసాయం, సీజనల్ కండిషన్స్, ఆరోగ్యం, సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళాశక్తి, విద్య, లా అండ్ ఆర్డర్, భద్రత సంబంధిత సమస్యతోపాటు యాంటి డ్రగ్ క్యాంపెయిన్ వంటి అంశాలపై చర్చించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, డీజీపీ డాక్టర్ జితేందర్, ప్రభుత్వ శాఖల ముఖ్య కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు తొలిఏకాదశి

కల్వకుర్తి, జూలై 16 : సంవత్సరం పొడుగునా 24 ఏకాదశులు ఉంటాయి. అందులో తొలి ఏకాదశికి చాల ప్రత్యేకత ఉంటుంది. వర్షాకాలంలో వచ్చే ఆషాడ శుక్ల ఏకాదశిని తొలిఏకాదశిగా పరిగణిస్తారు. శుభప్రదమైన కార్యాల కోసం దశమి, ఏకాదశిల కోసం ఎదురుచూడడం సహజమే. అందుకే తొలి ఏకాదశికి చాల విశిష్టత ఉంటుంది. తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు తమ ఇళ్లను శుభ్రం చేసుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రోజంతా ఉపవాసం దీక్షలు చేపట్టి సాయంత్రం ఆలయాలకు వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తారు. అటుకులు, జొన్న పేలాలు, బెల్లంతో దంచి పిండి చేసిన ప్రసాదంతో పాటు పేల పిండిని ప్రసాదంగా స్వీకరిస్తారు. తొలి ఏకాదశి సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం, కన్యకాపరమేశ్వరీ ఆలయం, కైలాసం గుట్టశివాలయం వద్ద ఏర్పాట్లు చేశారు.

మల్లయ్య సెలకు దరిచేరేది ఏలా..?

- తొలిఏకాదశికి భక్తుల ఇక్కట్లు

అమరగిరికి వెళ్లే దారి బురదమయంగా మారిన రోడ్డు

కొల్లాపూర్, జూలై 16 : కొల్లాపూర్ మండలం అమరగిరి గ్రామంలోని మల్లయ్య సెల ఆలయం అత్యంత ప్రవిత్రమైనది. ఆలయంలో తొలిఏకదశి రోజు శివుడి దర్శనం చేసుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని భక్తులు విశ్వాసం. దట్టమైన నల్లమల అటవీలో ఉండే మల్లయ్య సెల ఆలయంలో తొలిఏకదశి రోజు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ సారి తొలిఏకదశికి మల్లయ్య సెల ఆలయంలోని శివుడి దర్శనం భక్తులకు కష్టంగా మారనుంది. కొల్లాపూర్ నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉండే అమరగిరి వెళ్లాలంటే గంటకు పైగ సమయం పడుతోంది. అమరగిరి రోడ్డు మొత్తం గుంతలతో బురదమయంగా మారింది. బుధవారం తొలిఏకదశి రోజు భక్తులు మల్లయ్య సెలకు ద్విచక్రవాహనాలపై వచ్చే భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

సంబంధిత అధికారులు చొరవ తీసుకొని తాత్కాలికంగా రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

OLD AGE HOME

★ ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం|| చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.

NT-325763-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

- ఆయా దవాఖానల్లో చికిత్స పొందుతున్న రోగులు

స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

లింగాల, జూలై 16 : మండలంలో ఇటీవల వర్షాలు కురుస్తుండడం, వాతావరణంలో మార్పులు రావడంతో ఆయా గ్రామాల్లో ఇటీవల సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. మండలంలోని గ్రామాల్లో నుంచి బాధితులు వైద్యం కోసం ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలకు తరలిపోతున్నారు. ముఖ్యంగా మండల పరిధిలోని ఎంసీతండా, మాడాపూర్, కోమటికుంట, అప్పాయిపల్లి తదితర గ్రామాల్లో ప్రజలు మలేరియా, టైఫాడ్ అక్కడడక్కడ డెంగీ వ్యాధులతో బాధపడున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ దవాఖానలో రోజు వారీగా మలేరియా బాధితులు వస్తు పోతున్నారని వైద్య సిబ్బంది తెలిపారు. వ్యాధి తీవ్రతను బట్టి అత్యవసర కేసులను ఆస్పత్రిల్లోనే చికిత్స అందజేస్తున్నారు. కొంత మంది బాధితులు లింగాల, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ ప్రాంతాలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. ప్లేట్‌లేట్స్‌కు మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో సరైన వైద్య సదుపాయం లేకపోవడంతో జిల్లా కేంద్రంలోని ఏరియా దవాఖానకు రేఫర్ చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుద్య పనులు అస్తవస్త్యంగా మారడంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తగు సూచనలు సలహాలు ఇస్తున్నట్లు వైద్యాధికారి శివశంకర్ తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య పనుల పట్ల పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో ఆంజనేయులను ప్రశ్నించగా త్వరలో గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపట్టి మురుగు ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణకు బ్లీచింగ్ ఫౌండర్ చల్లించడం, ద్రావణాన్ని పిచికారీ చేయించడం లాంటి పనులను చేపట్టడం జరుగుతుందని ఎంపీడీవో పేర్కొన్నారు.

మొహర్రం వేడుకలకు ముస్తాబైన పీర్లచావిడీలు

- గ్రామాల్లో నెలకొన్న పీర్ల పండుగ సందడి

వెల్దండ : కొట్రలో పీర్లను ఊరేగిస్తున్న నిర్వాహకులు

కల్వకుర్తి రూరల్, జూలై 16 : కల్వకుర్తి మండలంలోని రఘుపతిపేట, మార్చాల, గుండూరు, లింగసానిపల్లి, ముకురాల, ఎల్లికల్ గ్రామాల్లో మొహర్రం వేడుకలకు నిర్వాహకులు పీర్ల చావిడీలను ముస్తాబుచేశారు. మార్చాల గ్రామంలోని పీర్లచావిడీలోని పీర్లకు వెండి గొడుగులతో అలంకరించారు. వారంరోజులుగా పీర్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

వెల్దండలో..

వెల్దండ, జూలై 16 : మండలంలోని కొట్ర, చెర్కూర్, పెద్దాపూర్, కుప్పగండ్ల, తిమ్మినోనిపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం పండుగ వేడుకలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దర్గాల వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఆయా గ్రామాల్లో పెద్దసరియత్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగింపు వెళ్లగా భక్తులు పీర్లకు నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించారు.

లింగాలలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి, జూలై 16: మండల పరిధిలోని పెద్దకారుపాముల, మరికల్, పెద్దకొత్తపల్లి, ముష్టిపల్లి, చంద్రల్, సాతాపూర్ గ్రామాల్లో మోహర్రం పండుగను పురస్కరించుకొని రాత్రి వేళల్లో పీర్ల దగ్గర ప్రజలతో సందడి నె లకొంటుంది. మహిళలు ప్రత్యేకంగా బొడ్డెమ్మలు, యువ త అలాయి ఆడుతున్నారు. ఐదు రోజులుగా రాత్రి వేళల్లో పీర్ల వద్ద ప్రజలతో సందడిగా ఉంది.

లింగాలలో..

లింగాల, జూలై 16 : లింగాల మండలంలోని ఆయా గ్రామాల్లో పీర్ల పండుగ ఘనంగా నిర్వహించుకుంటున్నారు. బతుకు దెరువు కోసం సుదూర పాంతాలకు వలస వెళ్లిన వారు మొహర్రం పండగను పురస్కరించుకొని పీర్లకు తమ మొక్కలను చెల్లించుకుంటున్నారు. హిందూ, ముస్లింలు ఐక్యతకు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే పీర్ల పండుగ ఉత్సవాలలో భాగంగా మంగళవారం వివిధ గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా పీర్లను ఊరేగిస్తూ సందడి చేశారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

అచ్చంపేటరూరల్, జూలై 16 : ఈనెల 17వ తేదీన నిర్వహించే తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉమామహేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి నిర్వహించే ప్రత్యేక పూజ కార్యక్రమాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే వంశీకృష్ణను ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసరావు, పాలకమండలి సభ్యులు ఆహ్వానించారు. అనంతరం చైర్మన్, ఈవో వేర్వేరుగా శాలువాతో ఎమ్మెల్యే వంశీకృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు పవన్, మహేశ్, మాజీ ఎంపీపీ రామనాథం, నాయకులు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఊర్కొండ, జూలై 16 : నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్యాప నిఖిల్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొమ్మరాజు పల్లికి చెందిన మాజీ సర్పంచ్ పెంటయ్యకు మంగళవారం జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిఖిల్ రెడ్డి, లబ్ధిదారుడికి రూ.58, 500చెక్కును అందజేశారు. కార్యక్రమంలో లోహిత్ రెడ్డి, పాలీస్ యాదగిరి, వెంకయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కల్వకుర్తి, జూలై 16 : కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన శ్రీనివాస్‌గౌడ్ కుటుంబాన్ని మంగళవారం కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరామర్శించారు. శ్రీనివాస్ గౌడ్ గౌడ్ భౌతిక కాయంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. మున్సిపల్ చైర్మన్ వెంట కౌన్సిలర్ సైదులు గౌడ్, మధు, శేఖర్‌గౌడ్, మోహన్‌గౌడ్ నాగరాజుగౌడ్ ఉన్నారు.

పట్టుదల ఉంటే లక్ష్యం సాధ్యం

- ఓయూ ప్రొఫెసర్ కరుణసాగర్

మాట్లాడుతున్న ప్రొఫెసర్ కరుణసాగర్

బిజినేపల్లి, జూలై 16 : సాధించాలనే పట్టుదల ఉంటే ఎలాంటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కరుణసాగర్ అన్నారు. మంగళవారం మండలంలోని పాలెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల స్వయం ప్రతిపత్తి పొందిన సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమిష్టి కృషితోనే ఈ అటానమస్ సాధ్యమైందన్నారు. సుబ్బయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వందశాతం పనిచేసినప్పుడే ఇలాంటిది సాధ్యమవుతాయని గుర్తు చేశారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఎంతో గొప్ప స్థానాలను అధిరోహించారని గుర్తు చేశారు. ఇలాంటి స్వచ్ఛమైన వాతావరణంలో కళాశాల ఉండడం ఇక్కడి విద్యార్థుల అదృష్టమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ లావణ్యానాగరాజు, సురేందర్, మల్లికార్జున్, బుడ్డయ్య, శారద, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధన తొలగించాలి

వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

బిజినేపల్లి, జూలై 16 : రాష్ట్ర ప్రభుత్వం ఓ పక్క రుణమాఫీ చేస్తామని చెబుతూనే రేషన్‌కార్డు నిబంధన పెట్టడం సరికాదని, వాటిని తొలగించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి చంద్రయ్య కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయం ముందు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఓవైపు రుణమాఫీ చేస్తూనే పొంతనలేని నిబంధనలు పెట్టడం, రుణమాఫీ నుంచి ప్రభుత్వం తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. ఒకే ఇంట్లో నలుగురు కుమారులు ఉన్నా ఇప్పటి వరకు రేషన్‌కార్డులు లేకుండా ఉన్నారని, ఈ రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధన పెట్టడం వల్ల చాలా మంది రుణమాఫీకి అనర్హులవుతారని, ఆ నిబంధన తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, స్వామి, ఆంజనేయులు, లింగయ్య, కృష్ణారెడ్డి, బంగారయ్య, రాంరెడ్డి, కేశవులు తదితరులు ఉన్నారు.

'అమ్మమాట- అంగన్‌వాడీబాట' ర్యాలీలు

అచ్చంపేటరూరల్ : ఐనోల్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో దమయంతి

ఉప్పునుంతల, జూలై 16 : మండలంలోని మామిళ్లపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం 'మన ఆట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన వీదులగుండా ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ బీపాషా మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటలతోపాటు విద్యాభ్యాసాన్ని అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రంలో మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండేటట్లు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

నేరళ్లపల్లిలో..

తిమ్మాజిపేట, జూలై 16 : మండలంలోని నేరళ్లపల్లి గ్రామంలో మంగళవారం 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా చిన్నారులు, వివిధ రంగాలకు చెందిన వారితో కలిసి ర్యాలీ నిర్వహించారు. 15 నుంచి 20వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో భాగంగా రెండున్నర ఏండ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించి, వారికి విద్యా, ఆరోగ్యం, క్రీడలపై శిక్షణ ఇచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, మెహరాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేటరూరల్, జూలై 16 : అచ్చంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఐనోల్‌లో మంగళవారం 'అమ్మబాట-అంగాన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని సీడీపీవో దమయంతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో తల్లులు, చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్లు యాశోద, ధనమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల, జూలై 16 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అమ్మ ఆలన, పాలనా దొరుకుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గిరిజా, విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని దారారం, అంబట్‌పల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అమ్మమాట–అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శాంతమ్మ, అంజలి, తిరుపతమ్మ, స్వరూప, సునీత, హెల్పర్లు మంజుల, సూరమ్మ పాల్గొన్నారు.

లింగాల : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

జూపల్లి పంచాయతికి రూ.4,50,900 ఆదాయం

చారకొండ, జూలై 16: మండలంలోని జూపల్లిలో ప్రతి ఆదివారం నిర్వహించే గొర్రెల, మేకల సంతకు ఎంపీవో వెంకటేశ్ ఆధ్వర్యంలో మంగళవారం వేలం నిర్వహించారు. జూపల్లి గ్రామానికి చెందిన మహేశ్ వేలంలో రూ.4,50,900లకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ తైబజార్ ద్వారా వచ్చిన ఆదాయం గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. వేలం దారుడు రూ.1,12,725 జీపీకి చెక్కు అందజేశారు. మిగతా డబ్బులు విడుతల వారీగా అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు వినోద్, రవిశంకర్ పాల్గొన్నారు.

తండాలకు బస్సు సౌకర్యం

పెద్దకొత్తపల్లి, జూలై 16: మండలంలోని కొత్త యాపట్ల, చంద్రబండ తండాలకు ఆర్టీసీ అధికారులు బస్సును పునప్రారంభించారు. కొన్ని రోజుల తర్వాత బస్సును బంద్ చేయడంతో గ్రామ నాయకులు ఆర్టీసీ డీఎంను కలిసి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బస్సు సౌకర్యం కల్పించాలని కోరాడు. దీంతో అధికారులు స్పందించి బస్సును పునరుద్ధరించారు. దీంతో గ్రామస్తులు శంకర్‌నాయక్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

కోడేరు, జూలై 16 : కొల్లాపూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆయిల్‌పాం తోటలు సాగుచేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులను పాటిస్తే మంచి దిగుబడులను సాధించవచ్చని ఉద్యావన శాఖ కొల్లాపూర్ రెవెన్యూ డివిజన్ అధికారి లక్ష్మణ్ మంగళవారం సూచించారు. ఆయిల్‌పాం మొక్కలు నాటి న మూడు నెలలు ఎలాంటి ఎరువులను వేయవద్దని సూచించా రు. మొక్క నాటిన మూడు నెలలకు ప్రతి మొక్కకూ 500 గ్రా ముల అమ్మోనియం సల్ఫేట్ +350 గ్రాముల, సింగిల్‌సూపర్‌ఫాస్పేట్ + 180 గ్రాముల మూరెట్ ఆఫ్‌ఫొటాష్ అదే ఒక ఎకరానికి 50 మొక్కలకు 25 కిలోల అమ్మోనియం సల్ఫేట్ + 18 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ +9కిలోల మూరెట్ ఆఫ్‌పొటాష్‌ను వేసుకోవాలని సూచించారు. ఎరువులు క్రమం తప్పకుం డా ప్రతి మూడు నెలలకు ఒకసారి వేసుకోవాలని సూచించారు.

ఐకాన్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

వెల్దండ, జూలై 16 : మండలంలోని కొట్ర గేటు వద్ద అనుమతి లేకుండా నడిపిస్తున్న ది ఐకాన్ స్కూల్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్ డిమాండ్ చేశారు. శాస్త్ర స్కూల్ పేరిట ఉన్న స్కూల్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా ఐకాన్ పేరుతో నడిపిస్తున్నారని ఆరోపించారు. శాస్త్ర ఇంటర్‌నేషనల్ స్కూల్ అనుమతితో ఐకాన్ స్కూల్ రన్ చేస్తూ ప్రజల వద్ద అధిక పీజులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఎంఈవో, ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు రాహుల్ ఉన్నారు.

పురివిప్పిన మయూరం

అప్పాజిపల్లి నర్సన్న గుట్టవద్ద పురివిప్పిన మయూరం

తిమ్మాజిపేట, జూలై 16 : వరుసగా కురుస్తున్న వర్షాలతో పచ్చదనం వెల్లివిరియడంతో ప్రకృతిని ఆస్వాధిస్తూ మయూరాలు పురివిప్పి నాట్యమాడుతున్నాయి. తిమ్మాజిపేట మండలం అప్పాజిపల్లిలో నర్సన్నగుట్టపై వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం పరిసరాల్లో పదుల సంఖ్యలో ఉన్న నెమళ్లు మంగళవారం ఉదయం పురివిప్పి నాట్యమాడాయి. మూడు నెమళ్లు తమ పించాన్ని విప్పి ఆటాడుతుండటాన్ని చూసిన ఆలయ అర్చకులు గంగాధర శర్మ దాన్ని తన సెల్‌లో బంధించి వాట్సాప్ గ్రూప్‌లో పెట్టాడు. ఫొటోలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

మరోసారి గుప్తనిధుల కోసం తవ్వకాలు

బల్మూరు, జూలై 16 : మండలంలోని కొండనాగుల గ్రామంలోని పెద్దగుడిబండ శివాలయంలో మంగళవారం మరోసారి గుప్త నిధుల కోసం తవ్వకాలు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయంలో తవ్వకాలు చేశారు. ఈ విషయంపై ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

- ఆరుగురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

లింగాల, జూలై 16 : అదుపుతప్పి ఆటో బోల్తాపడి ఆరుగురికి స్వల్పగాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉన్న ఘటన సోమవారం ఎంసీతండా గేట్ శివారులో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు లింగాల నుంచి శ్రీరంగాపూర్ గ్రామానికి వెళ్తున్న ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొని గుంతలో బోల్తా పడింది. ఆటోలో పది మంది ప్రయాణిస్తుండగా అందులో ఆరుగురికి స్వల్పగాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. గాయాలైన క్షతగాత్రులను లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య కోసం నాగర్‌కర్నూల్ ఏరియా దవాఖానకు తరలించారు. ఈ విషయంపై ఎస్సై శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

దొంగతనం కేసులో ఒకరి రిమాండ్

లింగాల, జూలై 16 : మండల కేంద్రానికి చెందిన మాకం చిన్నరాములు ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో మంగళవారం ఒకరిని రిమాండ్‌కు తరలించిన ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు మండల కేంద్రానికి చెందిన మాకం చిన్నరాములు ఇంట్లో ఈనెల 10న రాత్రి దొంగతనం జరిగినట్లు ఫి ర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. కాగా బళ్లారి అజయ్, ధ నుంజయ్, లింగస్వామి అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు సీ సీ పుటేజీలో రికార్డు అయింది. బళ్లారి అజయ్‌ను అదుపులో తీసుకొని విచారించగా ఏడు నేరాలను ఒప్పుకున్నట్లు తెలిపారు. అనంతరం అచ్చంపేట మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా రిమాం డ్ విధించినట్లు తెలిపారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ఊర్కొండ, జూలై 16 : గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు నిర్వహిస్తున్న ధర్నాలో ఆయన హాజరై మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలను అందజేయాలన్నారు. ఎంపీడీవో సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు.

నేడు పోతిరెడ్డిపల్లిలో వనమహోత్సవం

తిమ్మాజిపేట, జూలై 16 : మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉద్యానవన అధికారి చంద్రశేఖర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన ఐదుగురు రైతులకు చెందిన 33ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలను నాటనున్నట్లు తెలిపారు.